# పుస్తకాల మనిషి

ఆదిరాజు లీనమైపోయి చదువుతున్నాడు. చదువుకుంటూ ఉంటే అతనికి ఆకలి. నిద్ర కాబట్టవు. దీక్షగా చదువుతాడు. అలాగని అతను పరీక్షలకు చదువుతున్నాడంటే కాదు. అరవై దాటిన అతను ఏం పరీక్షలు రాయాలి! బ్రతుకుపోరులో యింకేం సాధించాలి! అతను చదువుతున్నది ఒక ఓల్డు క్లాసికల్ ఇంగ్లీషు నవల!

అప్పటికీ కూతురు పార్వతి వచ్చి పదే పదే హెచ్చరించింది. అయినా అతని ఏకాగ్రతకు భంగం కలిగించలేక పోయింది. చదువుతున్నప్పుడు అతనికి ఈ ప్రపంచంతో సంబంధం ఉండదు. ఆమె చెప్పిన మాటలు ఏవీ అతని చెవికెక్కలేదు. అతను ఏకసంథాగ్రాహి! చదివిన తరువాత ఎవరైనా ఆ పుస్తకంలో ఏ పేజీలో ఏముందో అడిగితే అవలీలగా రైటరు రాసిన మ్యాటరును తూచా తప్పకుండా చెప్పగలడు. అలాగని కేవలం ఆ ఒక్క పుస్తకమే ఆయన చెప్పగలడనుకుంటే పొరపాటే ! తాను చదివిన ఏ పుస్తకమైనా, ఎప్పుడు చదివినదైనా చెప్పగలడు. అతను అంతటి మేధావి! కానీ లోకానికి అతని గురించి తెలియదు. అతను చాలా చాలా సింపుల్ మనిషి నిగర్వి.

అతనికి కోరికలు లేవు సామాన్య మానవుడికి లాగా, అతనికున్న ఒకే ఒక్క కోరిక నిత్యం సాహిత్యాన్ని పఠించడం! ఇప్పటి దాకా వందలు, వేల పుస్తకాలు చదివాడు. ఒక్క తెలుగులోనే కాదు. ఆంగ్లంలో కూడా. తనకంటూ ఒక అద్భుతమైన లైబ్రరీ సేకరించుకున్నాడు. ఆ పుస్తకాలను ఓ పన్నెండు ఇనుపబీరువాలలో బందించాడు. చాలామంది ఇంటికి రాగానే ఆ బీరువాలను చూసి "ఎంత సంపాదించాడో, ఏం దాచుకున్నాడో" అనుకుంటారు. తీరా ఒక్కో బీరువా తెరచి చూపిస్తే - వాటి నిండా గుట్టలు గుట్టలుగా పుస్తకాలు. సామాన్య మానవుడికి విలువలని పుస్తకాలు. ఒక్క చలిమంటలు కాచుకోవడానికి తప్ప పనికిరాని పుస్తకాలు. మస్తిష్కంలేని వారికి అవి వాసనకొట్టే పాత చెత్తకాగితాలు మాత్రమే. వారికి అతనొక పిచ్చివాడు.

కానీ ఆదిరాజుకు మాత్రం అవి ప్రాణం ఉన్న నేస్తాలు! అతని సహచరులు– ఎన్నో సంవత్సరాలుగా – కొన్ని దశాబ్దాలుగా – అతని జీవితంలో భాగమైపోయిన సజీవ నేస్తాలు. అతని కష్టసుఖాలు తెలుసుకున్న నోరులేని జీవాలు.

అతనికి ఇంకో అలవాటుంది. ఏదన్నా గొప్ప పుస్తకం చదవగానే దానిలోని మకరందాన్ని నోట్సులాగా రాసుకుంటాడు. దాన్ని భద్రపరుస్తాడు. అతను రాసిన ఆ నోట్సును ఎవరైనా ముద్రిస్తే అదే ఒక సగం బీరువా అవుతుంది.

అతనిలోని సాహిత్య పిచ్చి చూసిన కొందరు ఆటపట్టిస్తారు.

" ఇన్ని వేల గ్రంథాలు చదివావు– చదువుతున్నావు– మరి నువ్వేం రాస్తావు?" అని.

" నేను రాయాల్సిన అవసరం లేదు. ప్రపంచంలో వేలకొద్దీ రచయితలు లక్షల గ్రంథాలను వెలువరించారు. అవి చదవడానికి ఒక జన్మ చాలదు. అయినా నేను పువ్వులలోని మకరందాన్ని గ్రోలే తుమ్మెదను మాత్రమే" అని వినయంగా చెబుతాడు.

కానీ వాళ్ళబ్బాయి నందకిషోర్ మటుకు యింకోరకంగా తన మిత్రులకు తెలియ జేస్తాడు. తండ్రి మాటలను ఖండిస్తూ....

" ఒకప్పుడు అంటే ఆయన యవ్వనంలో అద్భుతమైన పద్యాలు చందోబద్ధంగా రాసేవారు. ఎంతో మంది మెచ్చుకునేవారు. కానీ ఒకసారి వాళ్ళ గురువుగారు ఆయన్ని "నువ్వు రాయొద్దురా" అని ఆజ్ఞాపించారంట! అప్పటినుండి రాయడం మానుకున్నారు– ఆ విషయం ఆయన బాల్యమిత్రులకు మాత్రం తెలుసు!"

అదేమోగాని ఎవరికైనా ఓపిక ఉంటే... మన ప్రాచీన సాహిత్యంలోని అద్భుతమైన పద్యాలను ఒక వెయ్యిదాకా అతను అప్పచెప్పగలడు. ఈ వయసులో కూడా ! అంతటి శ్రద్ధ, జ్ఞాపకశక్తి అతనికున్నాయి మరి.

అన్నింటికంటే ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచే విషయం ఆదిరాజు ఒకప్పుడు గవర్నమెంటు ఉద్యోగం చేశాడుట. అదీ పోలీసు డిపార్టుమెంటులోనట. ఆఫీసుపని, తనపనే కాకుండా– ఎందరి పన్లో అవలీలగా చేసేవాడట! పని రాక్షసుడట!

కానీ... ఆ ఉద్యోగం తన గ్రంథపఠనం అలవాటకు అడ్డు వస్తున్నదని విసిగిపోయి ఉద్యోగానికి రాజీనామా సమర్పించాడట! పై అధికారులు – బంధువులు ఎంత చెప్పినా వినలేదట! అప్పటికి పట్టుమని అతని వయసు ముప్పది అయిదు సంవత్సరాలు కూడాలేవు. దానిలో కొనసాగితే అతను చాలా గొప్ప హోదాలో రిటైరై ఉండేవాడు.

భగవంతుడి దయవలన పెద్దలు యిచ్చిన కొన్ని ఎకరాల పొలం ఉండేది. ఒక పెద్ద ఇల్లు ఉండేది. పొలాలు– జంజాటాలు ఎందుకని ఆ ఎకరాలను అయినకాడికి అమ్మేసి ఆ డబ్బులను బ్యాంకులో వేసుకుని ఆ వడ్డీమీద జీవనం కొనసాగిస్తున్నాడు. అలా సాఫీగా సంవత్సరాలు గడిచిపోతున్నాయి.

అతని సంసారం చిన్నదే – ఇద్దరు ఆడపిల్లలు, ఒక అబ్బాయి. శ్రీమతి కాలం చేసి పది సంవత్సరాలు దాటింది.

అతని దినచర్యలో భాగంగా 'ఫ్రెండ్సు బుక్ డిపో' కు తరచూ వెళుతూ ఉంటాడు. ఆ ఊరిలో సాహిత్య పరిమళం అంటిన పుస్తకాల వ్యాపారి అతనొక్కడే కావటంతో అద్భుతమైన సాహిత్య గ్రంథాలు పుల్లారెడ్డి గారు తెప్పించేవారు. కేబులు టీవీలు రాకముందు తెలుగు సాహిత్యం ఒక వెలుగు వెలిగింది. కాకపోయినా చాలా సెంటర్లలో అద్దె లైబ్రరీలు ఉండేవి.

ఓ పదిహేనేళ్ల క్రిందటిమాట !

రోజుకు రూపాయి, అర్థరూపాయి, పావలా... ఆ పుస్తకం ఖరీదు బట్టి అద్దెలకిచ్చేవాళ్ళు. సాహిత్యప్రియులు అవి అద్దెకు తెచ్చుకొని చదువుకునేవాళ్లు. ఆఖరికి వార పత్రికలు- సినిమా పత్రికలు - ఇంగ్లీషు మేగజైన్లు కూడా దొరికేవి. ఆదిరాజు కూడా ఆ లైబ్రరీలకు పాతకుడే!

ఆదిరాజు ఫ్రెండ్సు బుక్‌డిపోకు పోయినప్పుడు కొందరు రచయితలు, సాహిత్య ప్రియులు కలుస్తూ ఉండేవాళ్ళు. దానికితోడు పుల్లారెడ్డి కూడా విస్తృతంగా చదివేవాడు కాబట్టి - ' ఈ పుస్తకం బాగుంది - ఆ పుస్తకం బాగుంది కొనుక్కోండి' అని డిస్కౌంటు యిస్తూ తనకు పడ్డ రేటుకు అమ్మేవాడు.

ఆ రకంగా ఆదిరాజు ఆ షాపులో ఎన్నో గ్రంథాలు కొన్నాడు. ఫలానా పుస్తకం కావాలని చెబితే ఫోను చేసి పుల్లారెడ్డి తెప్పించేవాడు ఒక వారం రోజుల్లో.

కానీ రోజులు మారిపోయాయి. చదివే ఓపిక తీరిక ఎవరికీ దొరకడం లేదు. సాధారణ సాహిత్యానికి పెద్ద పీట వేసే సగటు మహిళలు- గృహిణులు కేబుల్ టీవీలలో వచ్చే సీరియళ్లు- సిన్మాలు చూడ్డానికి అలవాటు పడ్డారు. ఆఖరికి చదువుకున్న వాళ్లకు కూడా పేపరు చదివే ఓపిక లేకుండా పోతున్నది.

మారిన రోజులకు ఆదిరాజు బాధపడ్తూ - కొన్ని దినపత్రికలు, ఆదివారం వెలువరించే అనుబంధాలను సేకరించి - చదువుకుని భద్రపరిచేవాడు. అవిగాక మార్కెట్టులో లభించే పత్రికలతో పాటు లభించే అనుబంధ నవలలను కొని సేకరించు కునేవాడు.

ఉదయం మార్నింగు వాకుకు పోయి కూరగాయలు తీసుకురావడం - స్నానం, పూజ వగైరాలు పూర్తి చేసి టేబుల్ ముందు కుర్చీలో కూర్చోవడం - సాయంత్రం దాకా చదవడం - సాయంత్రం టీ తాగి వాకింగుకు కాని - సెంట్రల్ లైబ్రరీకి గాని, ఫ్రెండ్స్ బుక్‌డిపోకు గాని వెళ్లడం, ఏడు, ఏడున్నరకల్లా తిరిగిరావడం - భోజనం చెయ్యడం - నిద్ర వచ్చేదాకా చదువుకోవడం - పండుకోవడం అంతే! పిల్లలు ఎవరూ ఆయన్ని ఇబ్బంది పెట్టేవారు కాదు.

అనవసరమైన కోరికలు లేవు. ఇరుగు పొరుగును చూసి ఏవేవో కొనుక్కోవాలని - ఏదేదో అయిపోదామని అతను అనుకోడు! అతను కర్మయోగి!

అలాగే ర్యాంకుల కోసం పిల్లల్ని పరుగెత్తించడం ఆయనకు తెలియదు. జీవిత సారాన్ని వంట బట్టించుకున్నాడు కాబట్టి పిల్లలకు బ్రతుకుతెరువు కోసం ఉద్యోగం అంటాడే కాని - ఉద్యోగం కోసం బ్రతకడం కాదంటాడు. పిల్లలకు అతనిలోని 'సంతృప్తి' అలవడింది. వారు అందుకే ఎంత మేధాశక్తి ఉన్నా సామాన్య ఉద్యోగాలు చేస్తూ బ్రతుకుతున్నారు.

కొడుకు నందకిషోర్ ఉద్యోగరీత్యా బెంగుళూరులో ఉంటాడు. ఒకమ్మాయి పెళ్ళి చేసుకొని కాపురం హైదరాబాదులో చేస్తున్నది. తల చెడిన ఇంకో కూతురు, ఆమెకు పుట్టిన వయసొచ్చిన పాప ఆదిరాజుతో ఉంటారు.

పుస్తకాలు అతనికి ఎంత ప్రాణం అంటే గ్రంథం కొనగానే దానికి చక్కటి అట్ట తొడుగుతాడు. ఎవరైనా చదివి యిస్తామంటే - ఎంతో నమ్మకస్తుడైతే తప్పించి - యింటికి ఇవ్వడు. ఎందుకంటే అతని దగ్గరున్న గొప్ప పుస్తకాలు కొన్ని ఇప్పుడు అలభ్యం! అభిరుచులు మారిపోయి సీరియస్ లిటరేచరు పునర్ముద్రణకు అస్సలు నోచుకోవడం లేదు. నలభై, యాభై సంవత్సరాల క్రిందటి పుస్తకాలు.

తరచూ తన బీరువాలు తెరచి తను చదివిన పుస్తకాలను ప్రేమగా పలకరించడం అతనికలవాడు. ఎప్పుడైనా పొరపాటున ఒకే పుస్తకం రెండు కాపీలు కనిపిస్తే ఒక కాపీని సాహిత్యప్రియులకు బహూకరించడం అతనికిష్టం! కథలు రాసే రచయిత ఎవరైనా వస్తే ' ఈ పుస్తకం మీ దగ్గర ఉండాలి ఉంచండి' అని అప్పుడప్పుడు యిస్తూ ఉంటాడు. ' వద్దండి, మీ దగ్గరే వుంచండి' అంటే "ఫరవాలేదు తీసుకోండి. ఒకరి దగ్గరే రెండు కాపీలు ఎందుకు, ఐనా వూరికే అలా బీరువాలో పడి వుండడం కన్నా మీలాంటి వారు చదివితే ఉపయోగం గదా, అదీ గాక మాయింట్లో పుస్తకాలు ఎవరూ చదవరు నేను తప్ప" అనేవాడు.

కానీ అతని దురదృష్టం కొద్దీ అతని పఠనాసక్తి పిల్లలకు ఎవరికీ రాలేదు.

వారికి సాహిత్యం పట్ల మోజు లేదు. అదే అతని బాధ!

" నాన్నా ! నువ్వు చదవటం చాలించి - బయలుదేరు - మన వీధిలోకి నీళ్ళు వస్తున్నాయట! ఇప&పటికే అందరూ యిళ్లు ఖాళీ చేసి వెళ్ళమంటున్నారు. మన వీధిలో అందరూ వెళ్ళిపోతున్నారు." గట్టిగా అరిచి చెప్పింది పార్వతి.

ఆ మాటల్తో ఈ లోకంలోకి వచ్చిన ఆదిరాజు "మనం నదికి కిలోమీటరు దూరంలో ఉన్నాం! నాకు తెలిసి మనింటి దాకా నీళ్లు రావు. మనం ఎందుకు వెళ్ళడం" అసహనంగా అడిగాడు.

" ఇందాకనే పక్క వీధిలోకి పోయి చూసి వచ్చాను. మోకాళ్ళలోతు వచ్చాయి. మన వీధి కొంచెం మెరకలో ఉంది కాబట్టి కొంచెం కొంచెం వస్తున్నాయి. సంచీలో బట్టలు, డబ్బులు సర్దాను, బయలుదేరు ఇంటికి తాళం వేసి పోవాలి".

ఆదిరాజు నిస్సహాయంగా చూశాడు. ఉన్న ఫళాన ఎక్కడికి పోవాలి? తనెంబడి ఏవని, ఎక్కడికని తీసుకుపోగలడు. తన ప్రాణనేస్తాలు బీరువాల్లో ఉండిపోయాయి.

" ఎక్కడికి పోదాం?"

" జగన్నాథ గట్టువైపు పొమ్మని పోలీసులు చెబుతున్నారు. లేదా డోన్ పట్టణం వైపు పొమ్మంటున్నారు. కొందరు రెండంతస్తుల మిద్దెలున్న వాళ్లు పైకి ఎకాకీకరు. ప్రక్క వీధిలో మీ ఫ్రెండు ఇల్లు చాలా ఎత్తులో మూడంతస్తులతో ఉంది గదా.. అక్కడికి పోదాం" పార్వతి చెప్పింది.

ఆదిరాజు గబగబా బీరువాలకు తాళాలు వేశాడు. ఎందుకైనా మంచిదని టేప్ తీసి నీళ్ళు లోపలికి పోకుండా అంతా అంటించసాగాడు. కింద వున్న పుస్తకాలన్నీ తీసి అటకల మీదకు చేర్చసాగాడు. ఆ పనుల్లో వుండగానే హోరు శబ్దంతో నీళ్లు వాళ్ళ యింటిలోకి వచ్చేశాయి. చూస్తుండగానే ఒకడుగు, రెండడుగులు, మూడడుగులు వచ్చేశాయి. ఆలోచించుకునే అవకాశం, ఇంక సర్దుకునే అవకాశం లేదు.

కంగారుగా తాళాలు వేసింది పార్వతి.

ఆదిరాజు తన బీరువాలను చూసుకున్నాడు. రైతుకు, నేలతల్లికి ఉన్న అనుబంధం, ఆయనకు, ఆ పుస్తకాలకు మధ్య ఉంది.

దాదాపు గుంజుకుని పార్వతి, ఆమె కూతురు లయ ఆదిరాజును పెద్ద పెద్ద అంగలతో వెనక వీధిలోకి తీసుకొచ్చారు. సావిత్రమ్మ గారిది మూడంతస్తుల మిద్దె! గబగబ మెట్లు ఎక్కి పైకి చేరుకున్నారు. అప్పటికే ఆ వీధిలోకి కూడా నీళ్ళు వచ్చేస్తున్నాయి.

అతి కష్టం మీద అన్ని మెట్లు ఎక్కి రెండో అంతస్తులోని వరండాలోకి చేరుకున్నాడు. ఆయాసంతో గుండె పట్టుకుని, ఓ పాతకాలపు యినప కుర్చీలో కూర్చున్నాడు... పుస్తకాల వియోగం!

" బాబాయిగారు మంచి నీళ్ళు తాగండి" సావిత్రమ్మ నీళ్ళు అందించింది.

" ఏం సావిత్రి, ఏంటి ఈ ఘోరం ! మన పేటలోకి వరద ప్రవేశించడమేంటి. యిరవై సంవత్సరాల క్రిందట హంద్రీ నదికి వరదలొచ్చినా, మనదాకా రాలేదు" ఆదిరాజు చెప్పాడు.

" లేదు బాబాయి గారు, ఈ సారి ఒకేసారి తుంగభద్రకు, హంద్రీకి వరదలొచ్చాయి" సావిత్రమ్మ చెప్పింది.

" అదెలా సంభవం?"

" కర్నాటకలో విపరీతమైన వర్షాలు పడ్డాయి. హోసుపేట డ్యాము నిండి పోయింది. ఆ నీళ్లు వదిలారు. మనకూ బాగానే వర్షాలు పడుతూ ఉన్నాయి. దీనికితోడు సుంకేసుల డ్యాముకు గండిపడిందని కొందరు, బద్దలయిందని కొందరు చెబుతున్నారు" ఆమె చెప్పింది.

" ఇవన్నీ మానవ తప్పిదాలేనట! శ్రీశైలం డ్యాములో ఉండాల్సిన దానికంటే ఎకుకీకవ నీళ్లు నిలువచేశారట! అందుకని ఆ డ్యాం బ్యాక్‌వాటర్ కర్నూలు జిల్లాని ముంచుతూ

వుంది" సావిత్రమ్మ కొడుకు సురేష్ చెప్పాడు.

టీవీ చూద్దామంటే కరెంటు ఎప్పుడో పోయింది.

కొన్ని సెల్‌టవర్లు మునిగిపోయి మూగవోయాయి.

సెల్లులో బ్యాటరీ అయిపోయి కొన్ని పనిచేయడం లేదు.

నిమిషాలు, గంటలు గడిచిపోతున్నాయి.

రాత్రి అయింది.

నీళ్ళు పెరుగుతున్నాయే కాని తగ్గడం లేదు.

" జుయ్" అని ఒక ప్రళయ ఘోష.

ఎనిమిది, తొమ్మిది, పది... ఒక అంతస్తు మునిగిపోయి, యింకో అంతస్తుకు ఎగబాకుతున్నాయి నీళ్లు.

రెండో అంతస్తు కూడా ఖాళీ చేసి యింకా పై అంతస్తుకు చేరుకోవలసి వచ్చింది. అక్కడ ఒక్క రూమే ఉంది. మిగతాదంతా ఓపెన్ ప్లేస్.

అది కూడా మునిగిపోతే ఏం చెయ్యాలి?

రెండో అంతస్తులోనికి రాక ముందు సావిత్రమ్మ గారు అందరికీ ఉప్మా చేసి పెట్టింది. సరిపోకపోయినా అందరూ అది తిని తృప్తి పడ్డారు.

పైన అప్పుడప్పుడు చినుకులు పడుతున్నాయి. చుక్కలు కనపడ్డం లేదు. నల్లని ఆకాశం పైన చల్లటి జల ప్రవాహాలు. క్రింద చెవుల్లో హోరు!

చాలామంది జనం ఆ ఏరియాను ఖాళీ చేసి వెళ్ళిపోయారు. ఎత్తు మిద్దెల మీదకి ఎక్కిన వాళ్ళు ఉండిపోయారు. వారి శాతం చాలా తక్కువ.

" కర్నూలును ఖాళీ చేసి సురక్షితమైన ప్రదేశాలకు వెళ్ళమంటున్నారు" సురేష్ తన సెల్లుకు వచ్చిన మెసేజి చూసి చెప్పాడు. బ్యాటరీ డౌన్‌లో ఉంది. కాబట్టి అతను దానితో మాట్లాడ్డం మానేశాడు.

" ఉన్న ఫళంగా యిన్ని లక్షల మంది ప్రజలు ఎలా పరుగెత్తుతారు. వెహికిల్సున్నవాళ్ళు ముందే వెళ్ళిపోయారు. లేని వాళ్ళకు వాహన సౌకర్యాలు లేవు. ముందు కింద దిగి కాలుపెడితే ప్రవాహంలో మునిగిపోతారు! బ్రతికుంటే బలుసాకు తినొచ్చు, మనందరం యిలానే ఉందాం. ఇంకా నీళ్ళు పెరిగితే కలిసి చచ్చిపోదాం!" విషాదంగా చెప్పింది సావిత్రమ్మ.

" అక్కా... మనమందరం ఇలా మునిగిపోవలసిందేనా?" పార్వతి ఏడుస్తూ అడిగింది.

" చూడు గంట గంటకు వరద ఉధృతి పెరుగుతున్నది. వరదలొచ్చి యిన్ని గంటలైనా ఎవరూ రక్షించడానికి ముందుకు రావడం లేదు. కర్నూలులో యింత దారుణంగా ఉంటే

అధికారులు ఏం చేస్తున్నారో" అంది సావిత్రమ్మ.

" కరువుసీమ కర్నూలులో యింత వరద ఎప్పుడూ చూడలేదు" సావిత్రమ్మ మామ సుబ్రహ్మణ్యం చెప్పాడు.

" కలియుగం నాడు శ్రీశైలంలోని మల్లికార్జున స్వామి ఆలయంలో మొసళ్ళు తిరుగాడుతాయట!" ఆదిరాజు తాను చదివిన కాలజ్ఞానం గుర్తొచ్చి చెప్పాడు.

" అదేమోగాని - అల్‌మట్టి డ్యాముకూడా నిండిపోతున్నదట. దాన్నుంచి నీళ్ళు వదిలితే కర్నూలు మొత్తం మునిగిపోవచ్చు" సురేష్ చెప్పాడు.

ఆపైన అందరూ భయంతో, చలితో వణుకుతూ అలా నిల్చుండిపోయారు. నిలబడలేక వాళ్ళు నేలమీద చతికిల పడ్డారు.

సుబ్రహ్మణ్యం గారు బి.పి., షుగరు పేషంటు. సంచీలో వెంట తెచ్చుకున్న బిస్కట్లు, బ్రెడ్డు తింటూ వున్నారు.

తండ్రికి ఏమీ తీసుకు రానందుకు పార్వతి విచారించింది. ఆదిరాజులో ఏవేవో ఆలోచనలు.

" జీవితం ఎంత బుద్భుద ప్రాయం! బుడగవంటి జీవితానికి ఎన్ని ఆశలు, ఎన్ని ఆలోచనలు, ఎన్ని కుతంత్రాలు. మనిషి మనిషికి ఉన్న దూరాలను పెంచుకునే ఎన్ని దుర్మార్గపు ఎత్తుగడలు.

జానెడు పొట్ట నింపుకోవడానికి తెల్లారి లేచిందగ్గర నుండి ఎవరిని ఎలా ముంచాలని ఆలోచిస్తూ ఉంటాడు మానవుడు! తాను ఎన్ని కోట్లు సంపాదించినా ప్రకృతి ముందు అయుమాత్రుడు. ఓ గడ్డిపోచ!

ఎంత నాగరికత అభివృద్ధి చెందినా - ఎంత ఎత్తుకు ఎదిగినా - ఎన్ని ఆకాశహర్మ్యాలు నిర్మించినా ప్రకృతి ఆగ్రహించినరోజు ఆకృతి లేకుండా నాశనం అయిపోతారు.

ఆదిరాజు మెదడులో ఎన్నో ఆలోచనలు గిర్రున తిరుగుతున్నాయి. ప్రపంచ సాహిత్యం అతనిని అల్లాడిస్తున్నది. పుస్తక వియోగంతో మస్తకం మండిపోతున్నది.

ఎన్నో యుగాలు గడిచింతర్వాత, బ్రతుకులు తెల్లారకుండాన, తెల్లారింది ఎటు చూసినా జల ప్రవాహం ! నేల అన్నది ఎక్కడా కనపడటం లేదు. ఇంటి కప్పులమీంచి కొట్టుకుపోతున్న చెట్లు చేమలు! ఎక్కడినుంచో వస్తున్న పశువుల కళేబరాలు, ఇంటి సామాగ్రి, ఇనుప బీరువాలు, ఈత వచ్చిన కొందరు ఈదుకుంటూ పోతున్నారు. అప్పుడప్పుడు నీళ్ళలో పోతున్న పాములు కనిపిస్తున్నాయి.

మంచినీరు కాని, ఆహారం కాని ఏదో రకంగా అందుతుందని ఆశించారు.

ఎవరో ఒకరు సాయం చేస్తారని ఎదురు చూశారు.

గంటలు గడిచినా ఎక్కడనుండి సాయం అందడం లేదు.

ఎదురు చూడ్డంలోనే రోజు గడిచిపోయి, రాత్రి వచ్చింది.

అలా నీరసంతోనే ఎదురు చూస్తూ ఆదిరాజు కుటుంబం, సావిత్రమ్మ కుటుంబం ఆ మిద్దెమీద గడిపారు.

ఆపత్కాలంలో మనిషిలో అంత నిగూఢ శక్తి దాగి వుంటుందని ఆరోజే ఆదిరాజుకు అనుభవం అయింది. వేళకు తిండి తినకపోతే నీరసం, తలనొప్పి వచ్చేవి. ఉదయం, సాయంత్రం లోటా లోటా కాఫీ తాగకపోతే తల దిమ్మెక్కి పోయేది. కాని ఇన్ని గంటలు తిండి తిప్పలు లేకపోయినా ప్రాణాల్ని నిలుపుకోగలిగారు అందరూ.

మరునాడు ఉదయం అవుతుండగానే పార్వతి అరిచింది.

" నాన్నా ! వరదనీరు తగ్గింది... అటు చూడు ఆ మిద్దెల అంచుకు చూడు. నీరు దిగిపోతున్న జాడలు కనిపిస్తున్నాయి."

సావిత్రమ్మ వాళ్ళు ఆనందంగా అటు చూశారు. నిజం ! నీరు వెళ్ళిపోయిన ఆనవాళ్ళు చూపిస్తూ గోడలు కనిపిస్తున్నాయి. రెండో అంతస్తులోంచి నీరు కూడా వెళ్ళిపోయింది. మొదటి అంతస్తు మెట్లు కనిపిస్తున్నాయి.

అలా యింకా కొన్ని గంటలు గడిచింతర్వాత, కొందరు ధైర్యవంతులు నీళ్ళల్లోకి దిగి నడుచుకుంటూ బయటపడసాగారు. నీళ్ళు వారి భుజాలదాకా పారుతూ వున్నాయి. అయినా పిల్లల్ని నెత్తిమీద పెట్టుకుని పోతున్నారు వసుదేవుడిలాగా.

" ఎందుకు వాళ్ళు అంత తొందరపడి వెళుతున్నారు. నీళ్ళల్లో జారిపడితే ప్రమాదం కదా?" ఆదిరాజు ఆవేదనతో అడిగాడు.

" లేదు అంకుల్ ! మళ్ళీ అల్‌మట్టి డ్యాం నుండి కూడా నీళ్ళు వదులుతారని పుకార్లు ఉన్నాయి. సడెన్‌గా వరద మళ్ళీ పెరగవచ్చు. తగ్గినప్పుడే సురక్షిత ప్రాంతాలకు పోవడం మేలు. మేము కూడా దిగి మా బంధువుల యిళ్ళకి వెళ్ళిపోతాం" చెప్పాడు సురేష్ అందుకు తన వాళ్ళను సిద్ధపరుస్తూ.

" అవును నాన్నా ! మనం కూడా బెంగుళూరు వెళదాం నందకిషోర్ దగ్గరికి" పార్వతి చెప్పింది.

" అవును తాతయ్యా! ఇక్కడ ఏ క్షణంలో జరుగుతుందో తెలీదు. ప్రశాంతత వచ్చే దాకా ఇంకెక్కడికన్నా వెళ్ళిపోదాం!" మనవరాలు లయ చెప్పింది.

ఆదిరాజు మనసంతా పుస్తకాల మీదే వుంది. వరదనీరు తగ్గగానే ఇంటికి పోయి వీలైనన్ని పుస్తకాలను రక్షించుకోవాలని వుంది. ఐనప్పటికి తనకిష్టం లేకపోయినా, యింటి పెద్దగా వారి ప్రాణాలు కాపాడ్డం తన బాధ్యతగా భావించి "సరే.. పదండి" అంటూ

బయలు దేరాడు వారివెంట.

అడుగులో అడుగు వేసుకుంటూ కిందకు దిగారు. చల్లగా నీళ్ళు భుజాలదాకా కొన్ని చోట్ల మెడలదాకా తగులుతున్నాయి. ఒకళ్ళ చేతులు ఒకళ్ళు పట్టుకుని మెల్లిగా నడుచుకుంటూ ఆ ప్రాంతం నుండి ఓ గంటలో బయటపడగలిగారు.

విచారిస్తే బస్సులు లేవన్నారు. రైళ్ళు కూడా రావడం లేదన్నారు. దొరికిన ఆటోలో డోన్ వైపు భారీ మూల్యం చెల్లించి కదిలారు.

అక్కడ నుండి బెంగళూరు చేరేసరికి దేవుడు కనిపించాడు. రద్దీలో ఒకళ్ళపైన ఒకళ్ళు పడి నిల్చుని... చివరికి కిషోర్ యింటికి వచ్చి పడ్డారు సజీవ శవాల్లాగా!

అక్కడ వున్నన్ని రోజులు ఇంటిమీదే ధ్యాస. సంవత్సరాలుగా సేకరించిన పుస్తకాలు ఏమై పోయాయో అని. కాలు నిలవడం లేదు. ఎప్పుడెప్పుడు కర్నూలు చేరదామా అని తొందరపడసాగాడు. పిల్లల బలవంతం మీద తప్పనిసరై ఓ వారం రోజులుండి, కర్నూలుకు తిరిగి వచ్చారు కిషోర్‌ను తీసుకుని.

ఇళ్ళంతా బురద బురద... మీటరు ఎత్తున పేరుకుపోయింది.

కంపుకొడుతున్న వీధులు, పనిచెయ్యని డ్రైనేజీ, రాని నీళ్ళు, కరెంటు కొన్ని చోట్ల పునరుద్ధరించబడుతున్నది.

దూరపు బంధువుల యింట్లో ఉండి ఇల్లు శుభ్రం చేసుకోసాగారు. కూలీలకు కూడా డబ్బు బాగా విదిలించాల్సి వస్తున్నది. ఆ కంపులో, బురదలో పనిచెయ్యాలంటే ఒక్కో కూలి కనీసం ఐదు వందలు లేనిది రావడం లేదు. అలా నలుగురినన్నా పెట్టుకోవలసి వచ్చింది. ముక్కులకు గుడ్డలు బిగించి పని చేస్తున్నారు.

బట్టలు, గిన్నెలు, సామాన్లు అన్నీ బురద మయం. బియ్యం పాడైపోయింది.

ఆదిరాజు పరుగులాంటి నడకతో తన గదికి చేరుకున్నారు. అటకలమీది పుస్తకాలన్నీ చెల్లాచెదురై బురదలో కూరుకుపోయి వున్నాయి. బీరువాల వంక చూశాడు. పన్నెండు బీరువాలు తాళాలు వేసి భద్రంగా ఉన్నాయి. కొట్టుకుపోలేదు.

ఆదిరాజు చేతులు వణుకుతున్నాయి. అతి కష్టంమీద ఒక బీరువా తెరిచాడు. అంతే బీరువాలోంచి బురదనీరు పెల్లుబికింది. పైనుంచి దబదబ పుస్తకాలు రాలి నేలమీద పడ్డాయి.

అంత బాగా టేప్ అంటించి తాళాలు వేసిన బీరువాలోకి వరద నీరు వచ్చి ఎలా చేరిందో అర్థం కాలేదు? ఎన్నో రోజులుగా నానిన పుస్తకాలు పిసపిసలాడుతూ వున్నాయి.

అలా ఒక్కో బీరువా తీస్తుంటే, వందలకొద్దీ పుస్తకాలు రాలిపడుతున్నాయి. ఆరడుగుల బీరువాలు... అన్ని అరలలో నీళ్ళు చేరిపోయాయి.

ఒక్కో పుస్తకాన్ని శుభ్రపరుద్దామని ప్రయత్నించాడు. అట్టలు వూడివస్తున్నాయి. కాగితాలు చినిగిపోతున్నాయి. కొన్నింటిని ఎండలో పెట్టాడు.

కాని... కాని... అత్యధికంగా.... పుస్తకాలన్నీ నాశనం అయిపోయాయి. ప్రపంచ సాహిత్యం చదివి తాను తయారు చేసుకున్న నోట్సులు కూడా నీళ్ళల్లో తడిసి అక్షరాలు అలుక్కుపోయాయి.

అసలే దశాబ్దాల నాటి పుస్తకాలు, బురదనీరు తగలడంతో పాటు వారం రోజులుగా నానీ నానీ ఎందుకూ పనికి రాకుండా పోయాయి. మిద్దెమీద ఎండబెట్టాడు ఆశ చంపుకోలేక.

రెండు రోజులైనా అవి ఎండలేదు. కొన్ని ఎండినా ముట్టుకుంటే రాలిపోతున్నాయి. ఏది తెరిచినా చినిగిపోతున్నాయి. దానికి తోడు భరించలేని దుర్గంధం!

" నాన్నా! నీ పిచ్చిగాని అవి ఇంక ఎందుకూ పనికిరావు?" కిషోర్ తేల్చి చెప్పాడు.

" కిషోర్ ! ఆరితే చదువుకోవచ్చేమో!" ఆదిరాజులో దింపుడు కళ్ళెం ఆశ.

" ఇంకా నయం ! ఆ వాసనకు అస్సలు చదువలేవు. పేజీలు ఓపెన్ కావు. అన్నీ ఒకదానికి ఒకటి అంటుకపోయి చినిగిపోతాయి. వాటిని బీరువాలో పెట్టినా వెంటనే చెదలు పట్టేస్తాయి" నందకిషోర్ వారించాడు. " మంచివి మిగిలితే వీటితో అవికూడా పాడైపోతాయి" అని హెచ్చరించాడు.

వార పత్రికల లాంటి వాటిని యింటి ముందు పారేశాడు కిషోర్.

అమూల్యమైన గ్రంథాలను ఒక్కొక్కటి తీసుకుని ఇంటిముందు వీధిలో పడేయాల్సి వచ్చింది ఆదిరాజుకు. సేకరించిన చెయ్యి విసిరి వేయాల్సి వస్తున్నది.

అవి పడేస్తుంటే దానిలోని విషయం గుర్తుకొచ్చి కన్నీరొస్తున్నది.

ఆదిరాజు ఆవేదనతో పాడైపోయిన పుస్తకాలన్నిటిని పక్కన పెడుతుంటే కిషోర్ వీధిలో గిరాటేశాడు. అతను చూస్తుండగానే చిత్తు కాగితాల అబ్బి వాటిని ఏరుకుని తీసుకుపోయాడు. ఎవరో తనగుండెని కోసి తీసుకుపోతున్నట్లు బాధపడ్డాడు.

పన్నెండు బీరువాలలోంచి బాగున్న పుస్తకాలను ఏరి ఇంకో బీరువాలోకి సర్దితే కేవలం రెండే రెండు అరలు నిండాయి.

డెబ్బై అరలలో కిటకిటలాడిన ప్రపంచ సాహిత్యం కర్నూలు వరదల్లో కొట్టుకు పోయింది.

" నాన్నా ! గవర్నమెంటు వరద బాధితులకు సాయం చేస్తున్నదట.... ఇల్లు మునిగిపోయిన వాళ్ళకు ఏడు వేలు యిస్తున్నారట" పార్వతి చెప్పింది.

" ఆ ! కోట్లు, లక్షలు విలువైనవి పోగొట్టుకుని, మూడు వేలు నాలుగువేలు తీసుకుని ఏం చేసుకోవాలి తల్లీ! వాళ్లు ఎంతిస్తే నా నేస్తాలు నాకు తిరిగి వస్తాయి! ఎన్ని లక్షలిచ్చినా

ఈ పుస్తకాలు యింకెక్కడైనా దొరుకుతాయా?" కన్నీళ్ళు పెట్టుకుంటూ అడిగాడు ఆదిరాజు.

" బాధపడకు నాన్నా! మనవే కాదు సెంట్రల్ లైబ్రరీ కూడా మునిగిపోయి, లక్షల్లో నష్టం వచ్చిందంట! ప్రభుత్వ ఆఫీసుల రికార్డులన్నీ నీటిలో తడిసిపోయి నాశనం అయిపోయాయట! ఆఖరికి వందల సంవత్సరాల కోర్టు రికార్డులన్నీ నీటి పాలయ్యాయట" చెప్పాడు కిషోర్.

" నిజమే ! కానీ అవి ఒక్కరికి చెందిన ఆస్తి కాదు. ఒక్కరు పెంచుకున్న అనుబంధం కాదు. అందరివి! కానీ ఇవి నా స్వార్జితం! నా రెక్కల కష్టం. జీవితాన్ని అనుభవించకుండా, సుఖాలను అదుపులో పెట్టుకుని స్వంతంగా పెంచుకున్న నా గ్రంథాలయం! దీనికోసం నా యవ్వనాన్ని అంతా ధారపోశాను. మీకర్థం కాదు. నేను ఏం పోగొట్టుకున్నానో, ఎంత పోగొట్టుకున్నాడో" వెక్కి వెక్కి ఏడ్చాడు.

ఆ బాధలోంచి బైటపడడానికి బెంగుళూరులో కొన్న ఒక పుస్తకం తీసుకొని చదువుకుంటూ అలాగే పడుకున్నాడు.

మరునాడు "నాన్నా! నిద్రలే, కాఫీ కలిపాను!" అని పిల్చిన పార్వతి పిలుపుకు స్పందన లేదు.

" తాతయ్యా ! చాలా ఆలస్యం అయింది. ఇంక నిద్రలే" అంటూ మేలుకొలుపు పాడిన లయకు " బుజ్జి" అన్న మధురమైన పిలుపు వినపడలేదు.

" నాన్నా నీ కోసం కొత్త నవల కొనుక్కొస్తాను తొందరగాలే" అన్న నందకిషోర్ పలకరింపుకు జవాబు లేదు.

ముగ్గురూ మంచం మీంచి లేవని ఆదిరాజును చూసి కొయ్యబారి పోయారు.

ఆదిరాజు శరీరం చల్లగా తగిలింది.

రాత్రి చదువుతూ గుండెలమీద వుంచుకున్న పుస్తకం మటుకు అలాగే ఉంది.

" నాన్నా !" అంటూ నందకిషోర్, పార్వతులు ఘొల్లుమన్నారు.

కిషోర్ మార్నింగ్ వాక్ నుండి తెచ్చిన ఆదివారం పేపర్లు, వాటి అనుబంధాలు ఆదిరాజు వంక అనాథల్లా చూస్తున్నాయి.

ఈ లోకం నుండి ఒక పుస్తకం మనిషి నిష్క్రమించాడు.

- ఉగ్రతుంగభద్ర 2010